
# సామాన్యుడిపై ధరల దరువు..



● ఆకాశాన్నంటిన నిత్యావసరాలు, కూరగాయల ధరలు ● రూ.100కు చేరిన టమాటా ● కన్నీరు పెట్టిస్తున్న ఉల్లి ● ఆందోళనలో ప్రజలు



పార్వతీపురం రైతు బజారులో కూరగాయలు కొనుగోలు చేస్తున్న వ్యక్తి

పార్వతీపురం టౌన్:

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అన్ని రకాల నిత్యావసర వస్తువుల ధరలు రెండు నెలలుగా పెరుగుతూనే ఉన్నాయి. ఎన్నికల ముందు నిత్యావసర ధరలు అదుపులోకి తీసుకువస్తామని చెప్పి గద్దె నెక్కిన ప్రభుత్వం.. ఆ దిశగా ఎటువంటి చర్యలు తీసుకోకపోవడంతో మూడు నెలలుగా ధరలు పెరుగుతూనా ఉన్నాయి. ఎక్కువ మంది వినియోగించే టామాటా ధర రైతు బజార్లలో కిలో రూ.73 వరకు పలుకుతున్నా.. బహిరంగ మార్కెట్‌లో మాత్రం రూ.90 నుంచి 100 రూపాయల మధ్య విక్రయిస్తున్నారు. గత నెలలో కురిసిన వర్షాలకు కూరగాయల తోటలు దెబ్బతినడంతో దిగుబడి బాగా తగ్గింది. ఇతర రాష్ట్రాల నుంచి కూడా దిగుబడులు రావడం లేదు. మరోవైపు జిల్లాలో కూరగాయల సాగు విస్తీర్ణం కూడా పెరగలేదు. పైగా ప్రతి ఏటా సాగు విస్తీర్ణం తగ్గుతోంది. నీటి సరఫరా సక్రమంగా ఉండే ప్రాంతాల్లో కూడా కూరగాయాల సాగు తగ్గుతోంది. ప్రస్తుతం అన్ని రకాల కూరగాయలు కిలో 50 రూపాయలకు పైమాటే. సాధారణ మార్కెట్‌లో దొండ, వంకాయ, బెండ, కాకర, బీర, క్యారెట్, ఇతర దుంపలు కిలో రూ.40 నుంచి 50 రూపాయల పైనే పలుకుతున్నాయి. రైతుబజార్లలో మాత్రం రూ.35 నుంచి 40 మధ్య విక్రయిస్తున్నారు. ఆకు కూరలన్నీ రెండు కట్టలు రూ.20 వరకు పలుకుతున్నాయి. ఉల్లిపాయలు రైతు బజార్లలో కర్నూలు రకం రూ.48 .. మహరాష్ట్ర రకం 53 రూపాయలకు విక్రయిస్తుండగా.. బహిరంగా మార్కెట్‌లో మాత్రం 70 రూపాయలకు పైగా పలుకుతున్నాయి.

## రైతుకు అంతంతమాత్రమే..

ధరలు పెరగడంతో రైతు కూడా లాభపడాలి.కాని వాస్తవ పరిస్థితుల్లో రైతుకు కనీసం గిట్టుబాటు ధర కూడా ఇవ్వడం లేదు. మధ్యలో దళారులు బాగా లాభపడుతున్నారు. మార్కెట్‌తో పాటు రైతుబజారస్, ఇతర పట్టణ ప్రాంతాల్లో ఉల్లి వ్యాపారం జోరుగానే సాగుతోంది. మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాలతో పాటు రాష్ట్రంలోని కర్నూలు, ప్రకాశం, గుంటూరు జిల్లాల నుంచి పెద్ద మొత్తంలో ఉల్లి మార్కెట్‌కు దిగుమతి అవుతోంది. స్థానిక మార్కెట్‌కు ఉల్లి చేరగానే దళారులంతా సిండికేట్‌గా ఏర్పడి మార్కెట్‌లో వారికి నచ్చిన ధరకు అమ్ముతున్నారు. సోలాపూర్ ఉల్లి అంటూ వీధుల్లో వచ్చే వారు సైతం కిలో రూ.70కి విక్రయిస్తున్నారు. రైతులకు రూ.17 మాత్రమే చెల్లించి అక్కడి నుంచి జిల్లాలోని వివిధ మార్కెట్‌లకు ఉల్లి తరలించి, వారికి నచ్చిన ధరకు విక్రయాలు చేపడుతున్నారు.

## ప్రభుత్వ నిర్లక్షం, అధికారుల పర్యవేక్షణ..

ప్రభుత్వ నిర్లక్షం, అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో దళారులు ఆడిందే ఆట పాడిందే పాటగా మారింది. జిల్లా అవసరాలు కోసం హోల్‌సేల్ మార్కెట్‌కు రోజుకు 25 టన్నుల లారీలు పది వరకు వస్తున్నాయి. హోల్‌సేల్ వర్తకులు కిలో రూ. 50 నుంచి 60 రూపాయల మధ్య విక్రయిస్తుండగా.. బహిరంగ మార్కెట్‌లో 70 రూపాయలకు పైబడి పలుకుతోంది. దీంతో ప్రజలు ఉల్లి కొనలేని పరిస్థితులు నెలకొన్నాయి.

### ధరలు తగ్గించాలి



నిత్యావసర వస్తువుల ధరలు తగ్గించాలి. ప్రస్తుతం రెండు నెలలుగా కూరగాయలు, నిత్యావసర సరుకుల ధరలు పెరుగుతూనే ఉన్నాయి. ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో భాగంగా నిత్యావసర వస్తువుల ధరలు తగ్గించాలి. అంతేగాని క్రమక్రమంగా ధరలు పెరుగుతూ వస్తున్నాయి. మాలాంటి పేద కుటుంబాలపై ఆర్థిక భారం తగ్గించాలి.

– ఎం. పార్వతి, పార్వతీపురం

### కొనాలంటేనే భయం వేస్తోంది..



ప్రతిరోజు తినే కూరగాయల ధరలు ఆకాశాన్నంటాయి. కూరగాయలు కొనాలంటేనే భయం వేసే పరిస్థితులు నెలకొన్నాయి. కూలి పని చేసుకుంటూ కుటుంబాలను నెట్టుకొస్తున్నాయి. పెరిగిన ధరలతో కుటుంబ పోషణ భారంగా మారింది. ప్రభుత్వం స్పందించి ధరలు తగ్గించాలని కోరుతున్నాం.

– ఆర్. లక్ష్మి, పార్వతీపురం

### మాట నిలబెట్టుకోవాలి..



గతంలో ఇచ్చిన ఎన్నికల హామీలలో భాగంగా ప్రభుత్వం నిత్యావసర సరుకులు, కూరగాయల ధరలు తగ్గించాలి. కూరగాయలు సైతం కొనాలంటే భయం వేస్తోంది. టమాటా కిలో వంద రూపాయలకు చేరుకుంది. ఉల్లి ధర కూడా పైపైకి వెళ్తోంది. ప్రభుత్వం ప్రత్యేక స్టాల్స్ ఏర్పాటు చేసి పేదలకు అందించాలి.

-బి.మణి, పార్వతీపురం

## అంగన్‌వాడీలకు ఇచ్చిన హామీలు అమలు చేయాలి



మాట్లాడుతున్న ఉమామహేశ్వరి

సాలూరు: అంగన్‌వాడీలు, మినీ అంగన్‌వాడీలకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ఎం.ఉమామహేశ్వరి డిమాండ్ చేశారు. మినీ అంగన్‌వాడీల సమస్యలపై పట్టణంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో ఉన్న మినీ వర్కర్లు అందరినీ ఎలాంటి షరతులు లేకుండా మెయిన్ వర్కర్లుగా మార్చాలన్నారు. వారి వేతనాలు పెంచాలని, సూపర్‌వైజర్ పోస్టులకు అర్హులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. అంగన్‌వాడీలకు సంక్షేమ పథకాలు అందించాలని కోరారు. అంగన్‌వాడీలు, మినీ అంగన్‌వాడీలకు ఇచ్చిన హామీలన్ని ప్రస్తుత ప్రభుత్వం అమలు చేయాలని, గతంలో చేసుకున్న మినిట్స్, ఒప్పందాలను తక్షణమే అమలు చేయాలని కోరారు. లేకపోతే భవిష్యత్‌లో జరగబోయే పోరాటాలకు ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి ఉంటుందని తెలిపారు. సమావేశానికి ముందు సీపీఎం నాయకుడు సీతారం ఏచూరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో నాయకులు ఉత్తరమ్మ, రామలక్ష్మి, పార్వతి, నారాయణమ్మ, సీఐటీయూ నాయకుడు ఎస్.వై.నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రంలో మతతత్వ రాజకీయాలు

● సీపీఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు



పెద్దింపేటలో సీపీఎం జెండాను ఆవిష్కరిస్తున్న పార్టీ సీనియర్ నాయకుడు సాంబమూర్తి

బలిజిపేట: కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో మతతత్వ రాజకీయాలను ప్రేరేపిస్తోందని సీపీఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు ఆరోపించారు. మండలంలోని పెద్దింపేటలో సీపీఎం జెండాను గ్రామానికి చెందిన పార్టీ సీనియర్ నాయకుడు సాంబమూర్తి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన మహాసభలో ఇటీవల మృతి చెందిన పార్టీ అగ్ర నేత సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం రెడ్డి వేణు మాట్లాడుతూ, కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ప్రజా సమస్యలను పక్కనబెట్టి, మతతత్వ రాజకీయాలు చేస్తున్నాయన్నారు. విశాఖ స్టీల్‌ప్లాంట్, విజయవాడ వరదలు, విభజన చట్టం హామీలు, సూపర్ సిక్స్ పథకాలు, నిత్యావసర సరుకుల ధరల పెరుగుదల వంటి సమస్యలపై దృష్టి సారించకుండా రాష్ట్రంలో మత వైషమ్యాలు సృష్టిస్తున్నాయని మండిపడ్డారు. ఇటువంటి విధానాలను మానుకోవాలని హితవు పలికారు. పెద్దింపేట పంచాయతీలో మంచినీరు, సాగునీరు, పారిశుద్ధ్యం వంటి సమస్యలపై దృష్టి సారించాలని తీర్మానించారు. కార్యక్రమంలో మన్మధరావు, గౌరీశ్వరరావు, సత్యం, కృష్ణ, రామారావు పాల్గొన్నారు.

## కందిపప్పు కొంతమందికేనా..

గుమ్మలక్ష్మీపురం: ఈనెలలో రేషన్ పంపిణీలో భాగంగా బియ్యం, పంచదారతో పాటు కొంత మందికే కంది పప్పును అందివ్వడం పట్ల రేషన్ కార్డుదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మార్కెట్లో కిలో కంది పప్పు రూ.160లు ఉండగా.. జీసీసీ ద్వారా కొంత మందికి కిలో రూ.67లకు అందించి, మిగతా వారికి అందించకపోవడంతో తామేమి అన్యాయం చేశామని, తమకెందుకు పప్పు ఇవ్వడం లేదంటూ సేల్స్‌మేన్లు, డీలర్లు, ఎండీయూ ఆపరేటర్లను నిలదీస్తున్నారు. ఈ విషయాన్ని జీసీసీ గొడౌన్ సూపరింటెండెంట్ ఎం.సాంబశివరావు వద్ద ప్రస్తావించగా ఐదు నెలల తర్వాత మరలా ఇప్పుడు డీఆర్ డిపోలకు సరఫరా చేసేందుకు కందిపప్పు వచ్చిందన్నారు. తమ పరిధిలో గల 35 డీఆర్ డిపోలకు మొదటి విడతగా 12 క్వింటాళ్ల కంది పప్పు రావటంతో ఒక్కో డిపోకు 85 కందిపప్పు ప్యాకెట్లు చొప్పున్న కేటాయించినట్లు చెప్పా రు. మొదటగా వచ్చిన కార్డుదారులకు వారిటి అందజేయాలని ఎండీయూ ఆపరేటర్లకు చెప్పడం జరిగిందన్నారు. రిమైనింగ్ పప్పు వచ్చిన వెంటనే కార్డుదారులందరికీ అందజేయడం జరుగుతుందన్నారు.

## ప్రజల ప్రాణాలతో చెలగాటమా?

● విశ్వనాథపురంలో డయేరియా వ్యాప్తికి కలుషిత నీరే కారణం
● ప్రజారోగ్యాన్ని పట్టించుకోని ప్రభుత్వం: ఎంపీపీ ప్రమీల



విలేకరులతో మాట్లాడుతున్న ఎంపీపీ బి.ప్రమీల

పాచిపెంట: ప్రజల ప్రాణాలతో అధికారులు చెలగాటమాడుతున్నారు. డయేరియా వ్యాప్తితో ఇప్పటికే మండలంలో విశ్వనాథపురం గ్రామంలో ఇద్దరు మృతి చెందగా మరో 40 మంది వరకు ప్రైవేట్, ప్రభుత్వ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. వ్యాధి వ్యాప్తికి కారణాలు వెతికే ప్రయత్నం వైద్యాధికారులు చేయగా కలుషిత నీరే కారణమని ల్యాబ్ పరీక్షల్లో వెల్లడయింది. దీంతో అధికారులు గ్రామానికి నీరు సరఫరా అవుతున్న రక్షిత మంచినీటి పథకాన్ని పూర్తిగా ఆపివేసి సాలూరు మున్సిపాలిటీ నుంచి ట్యాంకర్లలో నీటిని సరఫరా చేస్తున్నారు. అయితే ఆ నీరు కూడా బురదమయంగా ఉండటంతో గ్రామస్తులు అవాక్కయ్యారు. మా ప్రాణాలంటే అధికారులకు, ప్రభుత్వానికి లెక్కలేనట్లు ఉందని, ఇప్పటికే కలుషిత నీరు తాగి ఇద్దరు ప్రాణాలు కోల్పోయారని, మరి కొంతమంది వ్యాధితో బాధపడుతుంటే ఇలాంటి పరిస్థితుల్లో ఇటువంటి బురద నీరు పంపించి మా ప్రాణాలతో చెలగాటమాడుతున్నారంటూ గ్రామస్తులు మండిపడుతున్నారు.

**ఇదేనా మంత్రి స్పందన: ఎంపీపీ**

మంత్రి గుమ్మడి సంధ్యారాణి శనివారం విశ్వనాథపురం గ్రామంలో పర్యటించారు. గ్రామమంతా తిరిగి డయేరియా నివారణకు చర్యలు తీసుకున్నామని గొప్పగా చెప్పారు. దీనిపై ఎంపీపీ ప్రమీణ ఆదివారం స్పందిస్తూ.. గ్రామానికి ట్యాంకర్ల ద్వారా బురదనీరు సరఫరా చేయడమేనా కూటమి ప్రభుత్వ స్పందన అంటూ విమర్శించారు. మండల కేంద్రంలో విలేకరులతో ఆమె మాట్లాడుతూ విశ్వనాథపురంలో కలుషిత నీటి కారణంగా డయేరియాతో ఇద్దరు మృతి చెందారని, ప్రజలకు స్వచ్ఛమైన నీరు అందించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమయ్యిందన్నారు. ప్రభుత్వ పెద్దలు, అధికారులు గ్రామంలో పర్యటించి ఫోటోలకు ఫోజులు ఇస్తున్నారే తప్ప సమస్య పరిష్కారానికి చిత్తశుద్ధితో పని చేయడం లేదని ఆరోపించారు. తక్షణమే కలెక్టర్ స్పందించి గ్రామస్తులకు సురక్షితమైన మంచి నీరు అందించి డయేరియా నివారణకు చర్యలు చేపట్టాలని కోరారు. లేదంటే గ్రామస్తులు, ప్రజాప్రతినిధులు, నాయకులతో కలిసి కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపడతామన్నారు.

## మెడికల్ డిపార్ట్‌మెంట్‌లో విలీనం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఏఎన్ఎం యూనియన్ జిల్లా కార్యదర్శి సిహెచ్.స్వర్ణలత

పార్వతీపురం టౌన్ : ఏఎన్ఎంలను మాతృ సంస్థ అయిన మెడికల్ డిపార్ట్‌మెంట్‌లో విలీనం చేయాలని ఏఎన్ఎం యూనియన్ జిల్లా కార్యదర్శి సీహెచ్ స్వర్ణలత డిమాండ్ చేశారు. ఈ మేరకు సుందరయ్య భవనంలో యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో గ్రామ, వార్డు సచివాలయ ఏఎన్ఎంల విస్తృత స్థాయి జిల్లా సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సచివాలయ ఏఎన్ఎంలకు జీతాల బిల్లులను హెల్త్ డిపార్ట్‌మెంట్ ద్వారా చెల్లించాలన్నారు. ప్రభుత్వం నుంచి రావాల్సిన రాయితీలు వర్తింపజేయాలన్నారు. 35 క్యాజువల్ లీవులు మంజూరు చేయాలని, యూనిఫారం, ఇతర అలవెన్సులు చెల్లించాలని కోరారు. సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 14న డీఎంహెచ్ఓ ఆఫీస్ వద్ద నిరసన ధర్నా చేపట్టనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు ఎం.ఇందిర, డీవీ రమణమ్మ, వి.గౌరీశ్వరి, పి.రమణమ్మ, అన్ని మండలాల ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

## ఆర్యవైశ్య సంఘ జిల్లా నూతన కార్యవర్గం ఎన్నిక



ఆర్యవైశ్య సంఘ నూతన కార్యవర్గం ఇదే

పార్వతీపురం టౌన్: పార్వతీపురం మన్యం జిల్లా ఆర్యవైశ్య సంఘ నూతన కార్యవర్గాన్ని ఆదివారం స్థానిక ఆర్యవైశ్య యిండుపూరు వెంకటరావు కల్యాణ వేదికలో ఎన్నుకున్నారు. ఆర్యవైశ్య మహాసభ ఉపాధ్యక్షుడు తివ్వా మోహనరావు, మాజీ అధ్యక్షుడు జీవీ గున్నయ్య శెట్టి మాజీ అధ్యక్షుడు శెట్టి కనకరాజు నూతన కార్యవర్గంచే ప్రమాణ స్వీకారం చేయించారు. పార్వతీపురం మన్యం జిల్లా ఆర్యవైశ్య సంఘ అధ్యక్షుడిగా మమ్ముల విశ్వేశ్వరరావు, ప్రధాన కార్యదర్శిగా కోట సుబ్రహ్మణ్యం, కోశాధికారిగా పసుమర్తి శేషు, జాయింట్ సెక్రటరీగా జి. రామకృష్ణ, చీఫ్ అడ్వైజర్‌గా పార్వతీపురం మున్సిపల్ వైస్ చైర్మన్ యిండుపూరు గుణ్ణేశ్వరరావు, సాలూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా ఎం.సాంబశివరావు, పార్వతీపురం నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా ఇంకులు గాంధీ, సెక్రెటరీగా కోట సుబ్రహ్మణ్యం, వైస్ ప్రెసిడెంట్లుగా వి.సూర్యారావు, యిండుపూరు పెద గుంపస్వామి చక్క చినలచ్చయ్య, పసుమర్తి వెంకటప్రసాద్, ఎస్వీ సత్యనారాయణ, గ్రంధి వాసులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా మున్సిపల్ వైస్ చైర్మన్ గున్నేష్ మాట్లాడుతూ.. కార్యవర్గ సభ్యులు ఆర్యవైశ్యుల అభివృద్ధి కోసం పనిచేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్వతీపురం ఆర్యవైశ్య సంఘ అధ్యక్షుడు కొత్త నాగేశ్వరరావు, బంగారు వర్తక సంఘ అధ్యక్షులు యిండుపూరు గోపాలరావు, జల్లు రామకృష్ణ పాల్గొన్నారు.

## కషాయాలతో ప్రయోజనం



రైతులతో కషాయాలు తయారు చేయిస్తున్న ఏపీసీఎన్ఎఫ్ యూనిట్ ఇన్‌చార్జ్ భూషణరావు

గుమ్మలక్ష్మీపురం: జిల్లేడు ద్రావణం, నీమాస్త్రం, బ్రహ్మాస్త్రం వంటి కషాయాలతో పంటలకు ప్రయోజనముందని ఏపీసీఎన్ఎఫ్ గుమ్మలక్ష్మీపురం యూనిట్ ఇన్‌ఛార్జ్ కిమిడి భూషణరావు అన్నారు. మండలంలోని ఎల్విన్‌పేట పంచాయతీ జే.కే పాడు గ్రామంలో ప్రకృతి వ్యవసాయ విధానంలో పంటలు సాగుచేస్తున్న రైతులకు వివిధ రకాల కషాయాల తయారీపై శిక్షణ ఇచ్చారు. రైతులతో జిల్లేడు, నీమాస్త్రం, బ్రహ్మాస్త్రం కషాయాలను తయారు చేయించారు. ఈ కషాయాలను పంటలపై పిచికారీ చేయడం ద్వారా సుడి దోమ, దోమపోటు తెగుళ్లను నివారించడంతో పాటు పోటాష్ లోపాన్ని అరికట్టవచ్చన్నారు. తద్వారా పంట దిగుబడి పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది దీప, పద్మ, చామంతి, తదితరులు పాల్గొన్నారు.

## నిఘా విస్తృతం చేయాలి

పాలకొండ రూరల్: వరుస పండగల నేపథ్యంలో నిషేధిత క్రీడల జోలికి పోవద్దని పాలకొండ డీఎస్పీ ఎం.రాంబాబు అన్నారు. ఆదివారం తమ సిబ్బందికి పలు సూచనలు చేశారు. పండగలను ఆసరాగా చేసుకుని గ్రామాల్లో పేకాట శిబిరాలు, పొట్టేళ్ల పందేలు నిర్వహించినా, వాటిని ప్రోత్సహించినా చట్టపరమైన చర్యలు తప్పవన్నారు. గ్రామస్థాయిలో గల సచివాలయ మహిళా పోలీస్ వ్యవస్థ ద్వారా క్షేత్ర స్థాయిలో నిఘా మరింత విస్తృతం చేయాలని సిబ్బందికి సూచించారు. ఇతర ప్రాంతాల నుంచి వచ్చే వ్యక్తులు, అనుమానితులపై దృష్టి సారించాలన్నారు. ముఖ్యంగా ట్రాఫిక్ నియంత్రణ, అవసరమైన సమయంలో మళ్లింపునకు సంబంధించి తీసుకోవాల్సిన చర్యలను వివరించారు.

## క్లుప్తంగా

### సరుగుడు పత్రం పేస్టు తయారీపై అవగాహన

బలిజిపేట: మామిడి, జీడి, పనస వంటి పండ్ల చెట్లకు కాండం తొలిచే పురుగు నివారణకు సరుగుడు పత్రం పేస్ట్ ఉపయోగపడుతుందని ఐసీఆర్‌పీలు ఆదిలక్ష్మి, తిరుపతిరావు అన్నారు. ఈ మేరకు మండలంలోని మిర్తివలసలో ఆదివారం పేస్ట్ తయారీపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఐదు కిలోల సరుగుడు ఆకును తీసుకుని 25 లీటర్ల నీటిలో ఉడికించి వడకట్టాలన్నారు. ఆ మిశ్రంలో 15 కిలోల ఆవుపేడ, 15 కిలోల బంకమట్టి, 15 కిలోల ఇసుక పోసి బాగా కలియబెట్టాలని తెలిపారు. కొద్దిసేపటి తర్వాత 15 కిలోల గోమూత్రం వేసి బాగా కలుపుకుని, ఆపేస్టును మామిడి, జీడి, పనస చెట్ల కాండాలకు పూసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

### రికార్డుల పరిశీలన



గ్రామ సంఘాల రికార్డులు పరిశీలిస్తున్న కేంద్ర బృంద సభ్యులు

పార్వతీపురం టౌన్: మండలంలోని లక్ష్మీ నారాయణపురంలో కేంద్రబృంద సభ్యులు ఆదివారం పర్యటించారు. ఈ సందర్భంగా వెలుగు మహిళా సంఘాల సభ్యులతో మాట్లాడి, ప్రభుత్వం నుంచి తీసుకున్న రుణాలు జీవనోపాధికి ఎలా ఉపయోగించారో అడిగి తెలుసుకున్నారు. డీఆర్‌డీఏ పీడీ వై.సత్యంనాయుడు మహిళలు తీసుకున్న రుణాలు, వినియోగించే విధానాన్ని వివరించారు. రికార్డుల నిర్వహణపై బృంద సభ్యులు సంతృప్తి వ్యక్తం చేశారు.

### ప్రజా ప్రతినిధులకు శిక్షణ

● ఎంపీడీఓ త్రివిక్రమరావు



సీతానగరం : గ్రామ పంచాయతీల బలోపేతం, ప్రజా సమస్యల పరిష్కారం, సంక్షేమ పథకాలు అమలుకు సంబంధించి ఉప సర్పంచ్‌లు, ఇద్దరు వార్డు మెంబర్లకు సోమవారం నుంచి స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నాలుగు రోజులు శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ త్రివిక్రమరావు తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ, మండలంలోని 35 గ్రామ పంచాయతీల్లో అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలు చేయడంతో పాటు ప్రజా ప్రతినిధుల విధి విధానాలపై జిల్లా కోర్సు డైరెక్టర్ల ద్వారా శిక్షణ ఇస్తామన్నారు. సమాచారం తెలియజేసిన వార్డు మెంబర్లు, పంచాయతీ ఉప సర్పంచ్‌లు శిక్షణకు హాజరుకావాలని కోరారు. శిక్షణా సమయంలో భోజనం, వసతి సదుపాయం కల్పిస్తామన్నారు.

### చెట్టును ఢీ కొన్న ట్యాంకర్



నుజ్జునుజ్జు అయిన ట్యాంకర్ లారీ

సీతానగరం: మండలంలోని అంటిపేట సమీపంలో ఎదురుగా వస్తున్న ట్రాలీ (బండిని) వాహనాన్ని తప్పించబోయిన లారీ చింతచెట్టును ఢీ కొట్టడంతో డ్రైవర్‌కు గాయాలైన సంఘటన ఆదివారం ఉదయం చోటు చేసుకుంది. స్థానికులు అందించిన వివరాలిలా ఉన్నాయి. రాయగడ నుంచి విశాఖ వైపు వస్తున్న ట్యాంకర్ అంటిపేట సమీపంలో ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయి చెట్టును ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో ట్యాంకర్ డ్రైవర్ కె.రమణకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు స్పందించి డ్రైవర్‌ను జిల్లా కేంద్రాస్పత్రికి తరలించారు. అనంతరం పోలీసులకు సమాచారం అందించారు.

### నేటి నుంచి వార్డు మెంబర్లకు శిక్షణ

భామిని: మండలంలోని 27 గ్రామ పంచాయతీల పరిధిలోని ఉప సర్పంచ్‌తో పాటు మరో ఇద్దరు వార్డు మెంబర్లకు రెండు రోజుల పాటు శిక్షణా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ జి.చందరరావు ఆదివారం తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఉదయం 10.30 గంటలకు శిక్షణ ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. ఈ మేరకు పంచాయతీ కార్యదర్శుల ద్వారా స్థానిక ప్రజాప్రతినిధులకు ఆహ్వానాలు పంపినట్లు తెలిపారు.

### రావుపల్లిలో ఉచిత వైద్యశిబిరం

గరుగుబిల్లి: మండలంలోని రావుపల్లి గ్రామంలో పార్వతీపురం ధన్వంతరి హాస్పిటల్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో వైద్యులు ఎం.చాందిని, బి.రవికుమార్ సుమారు 100 మంది రోగులకు తనిఖీలు చేసి అవసరమైన మందులు ఉచితంగా అందజేశారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, కాచి చల్లార్చిన నీటిని తాగాలని సూచించారు. అనారోగ్య లక్షణాలు కనిపించిన వెంటనే వైద్యులను సంప్రదించి చికిత్స తీసుకోవాలన్నారు.

### ● అమ్మవారికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో దర్శనమిస్తున్న కామాక్షమ్మ తల్లి

సాలూరు: దేవీ శరన్నవరాత్రుల్లో భాగంగా పట్టణంలో, మండలంలో అమ్మవారి ఆలయాలు, మండపాల్లో అమ్మవారికి ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. పట్టణంలో కామాక్షమ్మ వారిని కరెన్సీ నోట్లు, కాయిన్స్‌తో ప్రత్యేకంగా అలంకరించారు. మహిళలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి అమ్మవారికి కుంకుమ పూజలు చేశారు.

### ● లలితా త్రిపురసుందరిగా దుర్గాదేవి

శరన్నవరాత్రుల సందర్భంగా దుర్గాదేవి ఆదివారం లలితా త్రిపురసుందరిగా భక్తులకు దర్శనమిచ్చింది. ఈ సందర్భంగా భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహి ళా భక్తులు సామూహిక కుంకుమ పూజలు నిర్వహించగా.. భక్తులకు ఎటువంటి ఇబ్బంది లు తలెత్తకుండా నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు.

– సీతానగరం/బలిజిపేట/పార్వతీపురం టౌన్



సీతానగరం: హనుమాన్ జంక్షన్‌లో లలితా త్రిపురసుందరీ అలంకరణలో అమ్మవారు



పార్వతీపురం టౌన్: లలితా త్రిపురసుందరి అవతారంలో కొత్తవలస దుర్గమ్మ



బలిజిపేట: అజ్జాడలో పూజలందుకుంటున్న విజయదుర్గా భవాని



పార్వతీపురం టౌన్: పూజలందుకుంటున్న సంగంవలస దుర్గమ్మ